www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 9 మార్చి 2023
5
వైఎస్ఆర్





కడప వివేకానంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి కవిత

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వార్తలు 6లో

ప్రచార హోరు!

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం పతాకస్థాయికి చేరుకుంది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థులు స్పష్టమైన విధానాలతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులు వ్యూహాత్మక ఎత్తుగడలతో పైచేయి సాధించడానికి ఆరాటపడుతున్నారు. ఎన్నికల బరిలో దిగిన 51 పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతు మీద ఆశలు పెంచుకున్న అభ్యర్థులు ఆయా పార్టీల కేడర్, ప్రలోభాలపై ఆశలు పెంచుకుని ప్రచారం సాగిస్తుండడం గమనార్హం.

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ జోరు
- అధికార, ప్రతిపక్ష కేడర్‌పైనే మద్దతుదారుల ఆశలు
- ఎన్నికల ప్రచారంలోకి హేమాహేమీలు
- ప్రధాన సమస్యలు పట్టని ప్రత్యర్థులు



ప్రచారం నిర్వహిస్తున్న పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 39 మంది పట్టభద్ర స్థానానికి, 12 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి బరిలో దిగిన సంగతి తెలిసిందే. పిడిఎఫ్ తరుపున పట్టభద్ర స్థానానికి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కత్తి నరసింహారెడ్డి పోటీ చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థులిద్దరూ మండలి పరిధిలోని ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. రాయలసీమ ఎడారి సీమగా మారిన నేపథ్యంలో పిడిఎఫ్ అభ్యర్థులు స్పష్టమైన విజన్‌తో సీమ సమస్యలను ప్రస్తావిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. సోషల్ మీడియా, కరపత్రాలు, ఉద్యోగ సంఘాల యూనియన్లు, ప్రజా సంఘాల సహకారంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

ప్రధాన పార్టీల కేడరే సర్వస్వం

అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతు పొందిన అభ్యర్థులు పార్టీ కేడర్‌లతో వరుసగా సమావేశాలు నిర్వహించడం, వాటిపై ఆధారపడి ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యేల సహాయంతో పార్టీ కేడర్‌లతో సమావేశాలు నిర్వహించడం, ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలపై ఆధారపడడం తెలిసిందే. ప్రచార ప్రారంభ సమయంలోనే టిఫిన్ బాక్సుల ప్రలోభాలకు తెరతీయడం వంటి అనైతిక పద్ధతుల ద్వారా ఎన్నికల ప్రచారాన్ని సాగించడం తెలిసిందే. టిడిపి అభ్యర్థి రిజిష్టర్ పోస్టుల ద్వారా ఓటర్లను అభ్యర్థించడం, పార్టీ కేడర్‌పై ఆధారపడి ఎన్నికల ప్రచారం సాగించడం వంటి విధానాలతో ముందు కెళ్తుండడం గమనార్హం. ఏదేమైనా ఎన్నికల ప్రచారంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతుపై ఆధార పడిన అభ్యర్థులు తమను గెలిపిస్తే ఫలానా లక్ష్యాలను సాధిస్తామని స్పష్టంగా ఓటర్లకు హామీలు ఇవ్వడం లేదు.

ప్రధాన పార్టీల నాయకుల వరుస పర్యటనలు

ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీ ఫైనల్‌గా భావిస్తుండడం అధికార, ప్రతిపక్ష పార్టీలకు కత్తిమీద సాములా మారినట్లు తెలుస్తోంది. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు, టిడిపి పరిశీలకులతోపాటు తాజాగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచెన్నాయుడు, వామపక్షాల రాష్ట్ర నాయకులు ఎన్నికల ప్రచారాల్ని పర్యవేక్షించడం ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారం ఉత్కంఠను కలిగిస్తుండడం గమనార్హం. అన్ని పార్టీలు తమ కేడర్‌ను సమాయత్తం చేస్తుండడం ఎన్నికల వ్యవహారం వేడెక్కింది.

ప్రధాన పార్టీలకు పట్టని ప్రాజెక్టులు

అధికార, ప్రతిపక్ష పార్టీల మద్దతు పొందిన అభ్యర్థులు సీమ సమస్యలు పట్టని వాతావరణం కనిపిస్తోంది. రాయలసీమ వెనుక బాటుతనానికి ఫలానా సమస్యలు కారణమని చెప్పకపోవడం, ఫలానా పరిశ్రమలను తెచ్చేందుకు కృషి చేస్తామని ప్రచారం చేయక పోవడం గమనార్హం. జిల్లాలో జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2లోని ఒకటి, మూడు మినహా మిగిలిన ఐదు ప్యాకేజీలు కోల్డ్‌స్టోరేజీకి పరిమితం కావడం తెలిసిందే. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2లో మొగమేరు అక్విడక్ట్ నిర్మాణం వెక్కి రిస్తోంది. ఇటువంటి ప్రధాన సమస్యను విస్మ రించడం క్షంతవ్యం కాని పని. యురేనియం నిర్వాసిత గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో ఏళ్లూపూళ్లూ గడిచిపోతున్న సంగతి తెలిసిందే. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇటువంటి ప్రధాన సమస్యలను మాటమాత్రమైనా ప్రస్తావించడం లేదు.

'సీమ' సమస్యలే పిడిఎఫ్ అజెండాగా..

పిడిఎఫ్ అభ్యర్థులు రాయలసీమ కన్నీటిని తుడవడానికి మండలిలో గళం వినిపిస్తామని ప్రచారం సాగించడం ఆకట్టు కుంటోంది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల దగ్గర నుంచి గండికోట, సోమశిల నిర్వాసితుల పరిహారం, మొగమేరు ఆక్విడక్ట్ పనుల పెండింగ్, కెసికెనాల్ ఆయకట్టు స్థిరీకరణ, సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ, కొప్పర్తిలో పరిశ్రమల ఏర్పాటు, యురేనియం విస్తరణ దుష్ప్రభావం, బ్రహ్మసాగర్, సర్వరాయసాగర్, వామికొండ, చిత్రావతి లీకేజీలు వంటి సమస్యలై ముందుకు వెళుతున్నారు. సీమ జిల్లాల్లోని పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల సాధనకు పాటుపడతామని ఎన్నికల ప్రచారం సాగించడం ఓటర్లను విశేషంగా ఆకర్షిస్తోంది. ఏదేమైనా పోలింగ్ నాటికి ఓటింగ్ పోలరైజే షన్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో వేచి చూడాల్సి ఉంది.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- మహిళా ద్రోహి సిఎం జగన్
- అధికారంలోకొస్తే మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్




మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 38వ రోజుకు చేరుకుంది. బుధవారం పీలేరు నియోజకవర్గంలోని చింతపర్తి బోయపల్లి క్రాస్ నుంచి నుంచి ప్రారంభమైన పాదయాత్ర విటలం, పునుగుపల్లి, వాల్మీకిపురం, ఆర్‌టిసి బస్టాండ్, మదనపల్లె మండలంలోని పూలవాండ్లపల్లి వరకూ పాదయాత్ర సాగింది. పూలవాండ్లపల్లి వద్ద విడిది కేంద్రంలో బస చేశారు. 13.9 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలతో ముఖాముఖి, మైనార్టీలు, స్థానికులతో మాటామంతి కార్యక్రమాలు నిర్వహించారు. చింతపల్లి విడిది కేంద్రం వద్ద లోకేష్‌ను ఫిజియోథెరపి అసోసియేషన్ నాయకులు కలిసి తమ సమస్యలు వివరించారు. మాజీ మంత్రి దేవినేని ఉమా పాదయాత్రలో పాల్గొని లోకేష్‌కు సంఘీభావం తెలిపారు. పాదయాత్ర సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ చట్టాల ద్వారా మాత్రమే మహిళలకు రక్షణ రాదని, చిన్న వయస్సు నుండే మగ వాళ్లకు మహిళల గౌరవం తెలిసేలా ప్రత్యేక పాఠ్యాంశాలు ఉండాలన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే కేజీ నుండి పీజీ వరకూ మహిళల గొప్పతనం, వారు పడే కష్టాలు తెలిసేలా ప్రత్యేక పాఠ్యాంశాలు పెడతామన్నారు. జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేదని, కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం 52 వేల మంది మహిళలపై వేధింపులు జరిగాయని వివరించారు. విద్యా రంగంలో ఇంకా మహిళలు వెనకబడి ఉన్నారని, ఎక్కువ మంది మహిళలు చదువుకోవడానికి, డ్రాప్ అవుట్స్ లేకుండా చేయడానికి టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ప్రత్యేక కళాశాలలు, ఉన్నత విద్యకు సహాయం, విదేశీ విద్యకు సహాయం అందిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వంలో భద్రత విష యంలో కానీ, జీతాల విషయంలో కానీ మహిళలకు సమాన హక్కులు లేవని, సమాన వేతనం కోసం టిడిపి హయాంలో అనేక చర్యలు తీసుకోవడం జరిగి ందన్నారు. అనేక పరిశ్రమలు తీసుకొచ్చిన్నప్పుడు మహిళలకు ప్రత్యేకంగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు మంచి జీతాలు ఇవ్వాలని మేము కంపెనీలను కోరేవాళ్ళం, మళ్లీ టిడిపి అధికారంలోకి రాగానే అన్నింటినీ పరిశీలించి తప్పక పరిష్కరిస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సంఘమిత్రలను వైసిపి ప్రభుత్వం తొలగించిందని, ఎన్నికల ముందు కులం, మతం చూడమని, ఇప్పుడు ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్ల దగ్గర నుండి సంఘమిత్రల వరకూ అడ్డగోలుగా తొలగిస్తున్నారన్నారు. ఆఖరికి డ్వాక్రా మహిళలు దాచుకున్న అభయహస్తం డబ్బులు కూడా జగన్ ప్రభుత్వం కొట్టేసిందన్నారు. చంద్రబాబు సిఎం కాగానే సంఘ మిత్రలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి పట్టాకు వన్ టైం సెటిల్మెంట్‌లో రూ.10 వేలు కట్టించుకోవడం దారుణమన్నారు. వన్ టైం సెటిల్మెంట్ ఒక పెద్ద మోసమని, రూ.10 వేలు కట్టించుకొని ఇచ్చిన ధ్రువ పత్రం తీసుకొని రుణం కోసం బ్యాంక్‌కు వెళ్తే బయటకి పొమ్మని తిడుతుండడం బాధాకరమన్నారు. మహిళలని మోసం చేసింది సిఎం జగన్ అని, దిశ చట్టం లేకుండానే జగన్ హడావిడి చేశారని, 900 మంది మహిళలపై అత్యాచారాలు జరిగితే 21 రోజుల్లో ఒక్కరికీ న్యాయం జరగలేదన్నారు. సంపూర్ణ మద్యపానం నిషేదం తర్వాత ఓట్లు అడుగుతానని, ఇప్పుడు ఏకంగా జే బ్రాండ్ లిక్కర్ తయారు చేసి అమ్ముతున్నారని, తాగుబోతులను తాకట్టు పెట్టి రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చాడన్నారు. టిడిపి హయాంలో ఇలాంటివి ప్రోత్సాహించే ప్రసక్తేలేదన్నారు. వైసిపి కేసులకు బయపడొద్దని, అక్రమ కేసులు పెట్టిన అధికారులపై టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జ్యూడిషియల్ ఎంక్వైరీ వేసి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే విదేశీ విద్య పథకాన్ని అమలు చేస్తామని, గతంలో నేరుగా కళాశాలలకే ఫీజురీయింబర్స్‌మెంట్ చేసే వాళ్ళమని, జగన్ ఫీజు రీయి ంబర్స్‌మెంట్ పథకాన్ని ఆపేసి విద్యా దీవెన, వసతి దీవెన పెట్టి మోసం చేస్తు న్నారన్నారు. ప్రతి ఏడాది రూ.32 వేల నుండి రూ.38 వేల ఫీజు ఉంటే తల్లి ఖాతాలో రూ.10 వేలు వేసి చేతులు దులుపుకుంటున్నారని, ఈ ఏడాది ఆ రూ.10 వేలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. హామీ ఇవ్వని సంక్షేమ కార్యక్ర మాలు కూడా అమలు చేసింది చంద్రబాబు నాయుడని, అన్న క్యాంటీన్, విదేశీ విద్య, పండుగ కానుకలు, చంద్రన్న భీమా, పెళ్లి కానుకలు ఇచ్చింది చంద్రబాబు నాయుడే అన్నారు. రూ.200 ఇస్తున్న పెన్షన్ రూ. 1800లు పెంచి, రూ.2000 చేస్తే జగన్ వచ్చిన తరువాత అనేక సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేశారని దుయ్యబట్టారు. పండుగ కానుకలు, పెళ్లి కానుకలు, విదేశీ విద్య, అన్న క్యాంటీన్, 100 సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసింది సిఎం జగన్ కాదా అని ప్రశ్నించారు. కరెంట్ ఛార్జీలు ఏడు సార్లు పెంచాడని, 8వ సారి మళ్లీ పెంచబోతున్నాడన్నారు. ఆర్టీసి ఛార్జీలు మూడు సార్లు పెంచి పెట్రోల్, డీజిల్ ధరల్లో జగన్ దేశంలోనే నంబర్ వన్ అని, నిత్యావసర సరుకుల ధరలు ఆకా శానికి అంటాయన్నారు. సంక్షేమ కార్యక్రమాలు రద్దు చేసిన చరిత్ర జగన్‌కి మాత్రమే దక్కిందని ఆరోపించారు. టిడిపి మహిళా రాష్ట్ర అధ్యక్షులు అనిత మాట్లాడుతూ జగన్ పరిపాలనలో మహిళలకు గౌరవం, రక్షణ, భరోసా లేవన్నారు. వైసిపి పాలనలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, గంజాయి మత్తులో మృగాళ్ళు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ మహిత, నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహిళలతో కలిసి సెల్ఫీ దిగుతున్న నారా లోకేష్



మోకాళ్ల పరీక్షలు చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్

మారుతీనగర్‌లో ఉన్న విద్యాసాగర్ ఆసుపత్రిలో ఎముకలు, కీళ్ళకు సంబంధించి బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ప్రముఖ ఎముకలు కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్మోన్ల అసమతుల్యత వల్ల, వయసు పెరిగే కొద్దీ మెనోపాజ్ తర్వాత మహిళల్లో ఎముకల్లో గూళ్ళు బారడం సమస్యలు వస్తాయని చెప్పారు. అధిక బరువు, సమతుల ఆహారం తీసుకోకపోవడం, శారీరక వ్యాయామం తగినంత లేకపోవడం వల్ల కీళ్ల అరుగుదల జరిగి ఆస్టియో ఆర్థరైటిస్ బారిన పడతారని పేర్కొన్నారు. తగినంత శారీరక వ్యాయామంతో పాటు కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. విటమిన్ డి శరీరానికి అందడం కోసం రోజూ కొంత సమయం ఎండలో తిరగడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు ఎదురవుతున్న సమస్యలలో షుగర్ వ్యాధి ఒకటని పేర్కొన్నారు. శారీరక మానసిక దృఢత్వం తప్పనిసరి అని చెప్పారు.

పిఆర్‌సిపై అసంతృప్తి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న మేకల శివార్జున

ఉద్యోగ ఉపాధ్యా యులు ఇప్పుడు పొందుతున్న పిఆర్‌సి పట్ల అసం తృప్తిగా ఉన్నారని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున అన్నారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇప్పుడు పొందుతున్న పిఆర్‌సిని రివర్స్ పిఆర్‌సిగా భావిస్తున్నామన్నారు. ఇంతవరకు ఒక డిఎ కూడా ప్రకటించకపోవడం దారుణమని వాపోయారు. గతంలో ఇలాంటి పరిస్థితులు లేవని చెప్పారు. ఎన్నికల సందర్భంగా సిపిఎస్ రద్దు లాంటి అంశంతో సహా ఎన్నో హామీలు ఇవ్వడం, వాటిపై ఆశలు పెట్టుకుని ఉద్యోగులందరూ ఈ ప్రభుత్వానికి ఓట్లు వేశారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డిఎలను వెంటనే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సి. సుదర్శన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. గంగరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి. శేషగిరిరావు, జిల్లా కార్యదర్శులు కట్టా గంగాధర్, రాజబాబు పాల్గొన్నారు.

దోపిడీ దారుడు ముఖ్యమంత్రి అయ్యారు

టిడిపి అధికారంలోకి వస్తే వ్యవస్థలను గాడిలో పెడతాం
దొంగ ఓట్లు ఎక్కించిన వారిని వదిలి పెట్టేది లేదు
టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కడప అర్బన్

దోపిడీదారుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా అయ్యారని జగన్‌మోహన్‌రెడ్డిని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. బుధవారం డిఎస్ఆర్ కళ్యాణ మంటపంలో రాయలసీమ పట్టపద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే వ్యవస్థల న్నింటిని గాడిలో పెడతామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీగా దొంగ ఓట్లు ఎక్కించారని వీరిని జైలుకు పంపించేందుకు టిడిపి విశ్రమించదని హెచ్చరించారు. జగన్‌పై పూర్తి వ్యతిరేకతతో ప్రజలున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ప్రజలు భయాందోళనతో ఉండడం వల్ల బయటపడడం లేదని చెప్పారు. సొంత చిన్నాన్నను హత్య చేసిన విషయంలో ఆ పార్టీ నాయకులు అసహనంతో ఉన్నారని పేర్కొన్నారు. ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి వ్యవస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. జగన్ అధికారంలోనికి వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికలు అన్ని ఆక్రమంగా, దౌర్జన్యంగా, పోలీసులను అడ్డుపెట్టుకొని జరిగినవే అని చెప్పారు. పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత టిడిపిది అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీదల రవిచంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్స్ అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్చార్జి అమీర్ బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి, నియోజకవర్గ ఇన్చార్యులు బత్యాల చందల్ రాయుడు, రమేష్ రెడ్డి, భూపేష్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, విశ్వనాథ నాయుడు, నగర అధ్యక్షులు శివ కొండారెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, ఖాదర్‌బాష, బచ్చుల పుల్లయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తాం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి రవి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్ పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తామని ఆర్ఐఒ రమణరాజు, ఆర్‌జెడి రవి పేర్కొన్నారు. ఈనెల 15న ప్రథమ, 16న ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల హాల్ టికెట్ల జారీలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన ఆర్ఐఒ కార్యాలయంలో కానీ, 08562-244171 కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని, సమన్వయంతో పని చేసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగించరాదని తెలిపారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలకు 24 పేజీల సమాధాన పత్రాలను, సెంటర్ నామినల్ రోల్స్‌ను, ఒఎంఆర్ షీట్స్ మిగతా అవసరమైన అన్ని పత్రలను పంపించామని తెలిపారు. జిల్లా డిఐఇఒ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో అలసత్వం ఉండరాదని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను తప్పకుండా అనుసరించాలని పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలోని ప్రతి రూమ్ లోనూ సీసీ కెమెరాల పర్యవేక్షణలో లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందని చెప్పారు. సమావేశంలో ప్రకాష్, వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి -కడప అర్బన్

గిరిజన భవన్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి, వైసిపి జిల్లా వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్. ఐ. శివా నాయక్, సంఘం యువజన అధ్యక్షులు జగన్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారాలు హోలీ పండుగను సాంప్రదాయ పద్దతిలో చేసుకుంటూ ఐకమత్యంగా ఉంటారన్నారు. బంజారాల సంస్కృతి, సంప్రదాయలు, వేషధారణ చాలా బాగుంటాయని పేర్కొన్నారు. గిరిజన భవన్ ఇంకా అభివృద్ధి కోసం ఎంపీ అవినాష్ రెడ్డి రూ. 10 లక్షలు ప్రకటించారని చెప్పారు. జిల్లాలోని బంజారా ఉద్యోగాలు, ప్రజలు సుమారు వేయి మంది ఆట, పాటలతో రంగులు చాలుకొని హోలి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో చిన్న రాముడు, డాక్టర్. శివ భరత్ రెడ్డి, రాచమల్లు రవి శంకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్య నంద రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట రమణ నాయక్, ప్రధాన కార్యదర్శి చక్రి నాయక్ పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తం అందజేస్తున్న దాత

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పట్టణంలోని వెంకటేశ్వర ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న నాగలకుంట్ల చెందిన గురివి రెడ్డి అనే వృద్ధుడికి ఒ నెగెటివ్ రక్తం అవసరం కావడంతో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవిని సంప్రదించారు. ఆయన నరసాపురానికి చెందిన రామ్‌ప్రసాద్ అనే యువకుడి ద్వారా మంగళవారం రక్తదానం చేయించారు. ఆపలో ఉన్న రోగులకు రక్తం అవసరమైతే 9110399831లో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్త దాతలుగా మారాలని కోరారు. గురివిరెడ్డి కుటుంబ సభ్యులు రామ్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రామయ్య , భాను పాల్గొన్నారు.

కొత్త పైప్‌లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

పంచాయతీలోని స్టార్ హైస్కూల్ సంధు, పూల బజార్ వీధిలో ప్రజల కోరిక మేరకు కొత్త పైప్‌లైన్ ను ఏర్పాటు చేశామని సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పైప్‌లైన్లను వేయిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్యలొచ్చినా తనను సంప్రదిస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అవిశ్రాంత పోరాట యోధులు జెవి

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సమరశీల పోరాటాలు నిర్వహించిన అవిశ్రాంత పోరాట యోధులు జూటూరు వెంకట్రామిరెడ్డి (జెవి) అని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో 27వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో తొలితరం నాయకుడైన జెవి రెండు పర్యాయాలు సిపిఐ జిల్లా కార్యదర్శిగా, రైతు సంఘం నాయకుడిగా పని చేశారన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, పెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిన పోరాటాలలో కీలక భూమిక పోషించారన్నారు. పార్టీపై నిషేధ కాలంలో అజ్ఞాతవాసంలో ఉంటూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. రాబోయే కాలంలో ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికీ తాగునీరు నిధులు నికరజలాల కోసం, జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సమరసింహల పోరాటాలు నిర్వహించడమే జెవికి ఘనమైన నివాళి అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను స్మరించుకోవాల్సిన అవసరమెంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి. బషిరున్నిషా, సుబ్రహ్మణ్యం, జి. వేణుగోపాల్, కె.సి. బాదుల్లా, గంగాసురేష్, టి మనోహర్ రెడ్డి, కె మునయ్య, అంకుశం, జి వల రాజు, బ్రహ్మం, మైనుద్దీన్, నాగరాజు, ఆర్ బాబు, అయ్యవారమ్మ, సుభాషిని, కొండమ్మ, అశోక్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న ప్రతినిధులు

ఎస్‌హెచ్‌జిలకు మెగా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మహిళా దినోత్సవం సందర్భంగా యూనియన్ బ్యాంక్ నుండి రుణంగా 20 స్వయం సహాయక సంఘాలకు రూ.3 కోట్ల మెగా చెక్కును సమాఖ్య ప్రతినిధులకు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం మండల సమాఖ్యలో సమాఖ్య ప్రతినిధులు, గ్రామ సమాఖ్యలతో ఎపిఎం వెంకటరమణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించారు. కబడ్డీ, లెమన్ స్పూన్, మ్యూజికల్ చెయిర్స్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. కేక్ కట్ చేశారు. గతంలో సమాఖ్య ప్రతినిధులుగా పనిచేసిన పాత అధ్యక్షులు సుమలత, శ్యామల, మండల సమాఖ్య మహిళా సిబ్బంది సిసి సుబ్బరత్నమ్మను సన్మానం చేశారు. కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖరరెడ్డి, కల్పేశ్, సురేష్, సిసిలు, యానిమేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వార్డు వాలంటీర్లను, కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక భాకరాపురంలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో ఆయన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నట్లు 175 సీట్లు గెలిచే లక్ష్యంగా పద్ధతి ప్రకారం, కార్యాచరణతో పనిచేయాలన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, హాల్ గంగాధర్‌రెడ్డి, వేల్పుల రాము, బయపరెడ్డి, నాగన్న, స్వామి, శివారెడ్డి, అంబ కపిల్ బాబు, కోరుకుంటపల్లి పల్లె శ్రీకాంత్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, తొండూరు లింగాల, సింహాద్రిపురం, వేముల మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సుచిత్ర చిత్రపటాన్ని బహూకరిస్తున్న చిత్రకారుడు

దేవరశెట్టి సుచిత్ర ఆదర్శనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తాను మృతి చెందినా తన అవయవాలు ఇతరుల జీవితాల్లో వెలుగు నింపాలని ప్రొద్దుటూరుకు చెందిన దేవరశెట్టి సుచిత్ర ఆదర్శనీయమని ప్రముఖ చిత్రకారుడు రామాంజనేయరెడ్డి (మహేష్ ఆర్ట్స్) తెలిపారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా బుధవారం సుచిత్ర చిత్రపటాన్ని ఆయన ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ సుచిత్ర బీఫార్మసీ పూర్తి చేసిన రెండేళ్ల క్రితం బెంగళూరులో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారన్నారు. ప్రయివేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ ఇటీవల హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో బ్రెయిన్‌డెడ్ అయి చనిపోయారన్నారు. తాను లేకున్నా తన శరీర అవయవాలు ఇతరులకు ఉపయోగపడేలా ఉండాలని ఆదర్శభావంతో పలువురికి ప్రాణం పోసి సజీవంగా నిలిచారన్నారు. సుచిత్ర చిత్రపటాన్ని సేవ్ ద చైల్డ్ లోగోతో బహూకరించినట్లు రామాంజనేయరెడ్డి తెలిపారు.

టిటిడి బోర్డు మాజీ సభ్యులు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


నివాళులర్పిస్తున్న సిఎం రమేష్‌నాయుడు

టిటిడి బోర్డు మాజీ సభ్యులు, సీనియర్ నాయకుడు చింతకుంట సత్యనారాయణ నాయుడు (77) బుధవారం ఉదయం పొట్లదుర్తిలోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆయన కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. జిల్లాలోని ప్రముఖ రాజకీయ నాయకులు వరదరాజులురెడ్డి, భూపేష్‌రెడ్డి, డక్కు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సిఎం రమేష్ నాయుడు, శివనాథరెడ్డి, రామసుబ్బారెడ్డి, బీటెక్ రవి, సుధీర్‌రెడ్డి, ఎంవి మురళీధర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సురేష్‌నాయుడు ఘనంగా నివాళులర్పించారు.

కారును ఢీకొన్న బైక్ : యువకుడి మృతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద అతివేగంగా వచ్చిన బైక్ కారును ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రాయచోటి పట్టణం నాయబ్ సాబ్‌వీధికి చెందిన జియాయుర్ రెహమాన్ స్నేహితులతో కలిసి మల్లూరమ్మ జాతరకు వెళ్తున్న సమయంలో బెంగళూరు నుండి కడపకు వెళ్తున్న ఇన్నోవా వాహనాన్ని అతివేగా ఢీకొనడంతో కారు అద్దంపై పడి దాదాపు పది అడుగుల ఎత్తుకు ఎగిరి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలోని మృతి చెందినట్లు రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ మొహమ్మద్ రఫీ తెలిపారు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడ్డిలో కుళ్లిన మృతదేహం లభ్యం

తప్పిపోయిన తుమ్మల వెంకటరమణగా గుర్తింపు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని మద్దిరేవుల గ్రామం ఈడిగపల్లిలోని తుమ్మల వెంకటరమణ(75) గత నెల 14న తెల్లవారు జామున మూడు గంటల నుంచి కనిపించలేదని, ఆయనకు మతిస్థిమితం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వినోద్‌కుమార్ మిస్సింగ్ కేసు నమోదు చేసి తేది నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఊరికి ఒకటిన్న కిలోమీటర్ల దూరంలో ఏపుగా పెరిగిన గడ్డి ఉన్న మడిలో కుళ్లిన శవం ఉందని గ్రామస్థులు ద్వారా తెలుసుకొని పరిశీలించగా కుటుంబ సభ్యులు కుళ్లిన శవం తుమ్మల వెంకటరమణదిగా నిర్ధారించు కొని పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు ఎస్ఐ వినోద్ కుమార్ ఆదేశం మేరకు పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కుళ్లిన శవంను పరిశీలించారు. బంధువులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని మృత దేహాన్ని పంచనామా అనంతరం బంధువులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

రాత్రివేళ అందని వైద్యం

- సిబ్బంది నిర్వాహకం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపమని ఆరోపణలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం సర్కార్ వైద్యం పేదలకు అందడంలేదనే ఆరోపణలున్నాయి. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసినా.. సిబ్బంది నిర్వాకం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఆసుపత్రి పనితీరు అస్తవ్యస్తంగా మారింది. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల ఆసుపత్రిగా ఉన్నా.. ఎక్కడా ఆ మాత్రం సేవలు అందడం లేదని రోగులు వాపోతున్నారు. రాత్రిపూట అత్యవసర పరిస్థితుల్లో ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తే సిబ్బంది స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. సిబ్బంది తలుపులు మూసుకొని నిద్రిస్తుంటారని, పలకకపోవడంతో వెనుదిరిగి వెళ్లాల్సివస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట అందుబాటులో ఉండాల్సిన సిబ్బంది ఆస్పత్రి ద్వారాలు మూసి నిద్రిస్తుండడం ఎంతవరకు భావ్యమని పలువురు రోగులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాత్రివేళ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

లక్ష్యం ఉంటే రాణించొచ్చు : పిఒ



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉంటే, ఆయా రంగాల్లో రాణించేందుకు వీలుంటుందని ఎస్ఎస్ఎ ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక అక్షర మహిళా జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ అనేది విద్యార్థుల్లో ఉన్నప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. ఇంటర్ చదువులో విద్యార్థులు ఎక్కువగా చదువుపైనే దృష్టి పెట్టాలని సూచించారు. చెడు ఆలవాట్లుకు దూరంగా ఉండాలని కోరారు. ఇంటర్ పూర్తయిన తర్వాత ఉన్నత చదువులు కోసం మంచి కోర్సులను ఎంచుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలోని ఆయా రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల చదువుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తోందన్నారు. అనంతరం అంబవరం ప్రభాకర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, లక్ష్మి గాయత్రి, చంద్ర ఓబుల్‌రెడ్డిలను కళాశాల తరుపున ఘనంగా సత్కరించారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అక్షర కళాశాల కరస్పాండెంట్ భూమిరెడ్డి విజయభారతి, ప్రిన్సిపల్ చందన, వార్డు మెంబర్ ముత్యాల ఆంజనేయులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఆరుతడి పంటలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో రబీలో సాగు చేసిన జొన్న, మినుము, మొక్కజొన్న, వేరుశనగ పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఫిబ్రవరి ప్రారంభం నుంచి మార్చి రెండవ వారం వరకు రైతులు పంటలను సాగు చేశారు. ప్రస్తుతం పంటలు వివిధ దశల్లో ఉన్నాయి. మండల పరిధిలోని వెదురూరు, రాజుపాలెం, తిప్పిరెడ్డిపల్లె, సిద్ధారెడ్డిపల్లి, మడూరు, చియ్యపాడు, వెంగన్నగారిపల్లె, చెండ్లూరు, రేపల్లె గ్రామాల పరిధిలో 3,500 ఎకరాల్లో ఆరుతడి పంటలను సాగు చేశారు. నవంబర్ నెలలో రబీలో సాగు చేసిన పంటలు జనవరి చివరికి ఎక్కువ భాగం నూర్పిడి చేశారు. కుందూ, పెన్నా తీర గ్రామాల పరిధిలో మాత్రం వరి పంటను రైతులు సాగు చేశారు. కొంతమంది రైతులు నూగు, దోస పంట సాగు చేపట్టారు.


సిద్ధారెడ్డిపల్లె వద్ద సాగులో ఉన్న మినుము పంట

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలగడలో హోలి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. యువత కేరింతల కొడుతూ రంగులు వేసుకుని హోలి సంబరాలు ఘనంగా నిర్వహించారు. **మదనపల్లె అర్బన్ :** అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు పి.అమరేంద్రనాయక్ ఆధ్వర్యంలో మదనపల్లి నక్కలదిన్నె తండాలో వైభవంగా హోలి ఉత్సవాలుఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఎదుట నృత్యాలు చేశారు. అలాగే సేవాలాల్ మహారాజ్కి పూజ నిర్వహించి ప్రసాదాలు పంచిపెట్టారు. ఎబిబిఎస్ జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్ నాయక్, ట్రెజరర్ ప్రభాకర్ నాయక్, యూత్ సెక్రెటరీ మనోహర్ నాయక్, ముని స్వామి నాయక్, తిరుమలేష్ నాయక్, సరస్వతి పాల్గొన్నారు. **కలికిరి :** మండల వ్యాప్తంగా హోలి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సిఐఎటి-3 స్కూల్, సిఆర్‌పిఫ్ కమాండెంట్ కెసి నిర్మల్ అధికారులు, జవాన్లుతో కలసి హోలి నిర్వహించారు. వేడుకల్లో సింగ్, కదమ్‌సింగ్, ఎస్‌పి.నందన్వార్ డిప్యూటీ కమాండెంట్లు హనుమాన్‌రామ్, కె.రవి కుమార్, కె.గిరిధర్ ఈ సంస్థలోని ఇతర ర్యాంకులు అధికారులు, వారి కుటుంబ సభ్యులు, ట్రైనీలు పాల్గొన్నారు.


అభివృద్ధి కానున్న సోమాపురం దళితవాడ ప్రాథమిక పాఠశాల

రూ.12 లక్షలతో పాఠశాల అభివృద్ధి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సోమాపురం దళితవాడ ప్రాథమిక పాఠశాలను రూ.12 లక్షలతో నాడు- నేడు నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే ప్రహరీ, తరగతి గదిలో చప్పట వంటి పనులు కొనసాగుతున్నాయి. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు అదనపు గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో నాడు-నేడు ద్వారా ఖాదర్‌పల్లె ప్రాథమిక పాఠశాలకు రూ.36 లక్షలతో మూడు గదులు, ఉర్దూ పాఠశాలకు రూ.36 లక్షలతో మూడు అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. సోమాపురం దళితవాడ పాఠశాలకు రూ.12లక్షలు, నరహరిపురం ప్రాథమిక పాఠశాలకు రూ.12 లక్షలు, నాగులపల్లి, లక్ష్మీపేట, చిన్నగురువలూరు, నక్కలదిన్నె ప్రాథమిక పాఠశాలలకు రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. వీటితోపాటు రెండో విడత నాడు-నేడు ద్వారా చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూ.60 లక్షలు, నరహరిపురం హైస్కూలుకు రూ.69 లక్షలు, చియ్యపాడు హైస్కూల్‌కు రూ.63 లక్షలు, అయ్యవారిపల్లి హైస్కూల్‌కు రూ.42 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, పనులు కొనసాగుతున్నాయని ఎంఇఒ వివరించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని వెంకటేశ్వర స్వామి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కెఎస్ఆర్ స్కూటీల షోరూంను బుధవారం మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తొండూరు పార్టీ ఇన్‌ఛార్జి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన స్కూటీలు అందించాలన్నారు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, అన్వర్ బాషా, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లకు పెరిగిన వడ్డీ : మేనేజర్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎస్‌బిఐలో డిపాజిట్ దారులకు ఎక్కువ వడ్డీ అందిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్లు రవికుమార్, శశికుమారి తెలిపారు. ఆ మేరకు బ్యాంకు సిబ్బంది బుధవారం నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులు వెంబడి ర్యాలీ నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌బిఐలో ఫిక్స్ డిపాజిట్‌పై వడ్డీ రేట్లు 7.90శాతం పెరిగిందన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్లు మస్తాన్ సాహెబ్, శ్రీదేవి, రవి, చేతన్‌కుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంక్ సిబ్బంది

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

- ఎస్‌పి కెకెఎన్.అన్బురాజన్



ప్రముఖ గైనకాలజిస్ట్ మమతేశ్వరిని సన్మానిస్తున్న ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

సమాజంలో మాతృమూర్తికే అగ్రస్థానమని, సహనం, ఓర్పు, ధైర్యంతో కుటుంబాన్ని, తద్వారా సమాజాన్ని, దేశాన్ని అగ్రస్థానంలో నిలపడంలో మహిళ పాత్ర అమోఘమని ఎస్‌పి కె.కె. అన్బురాజన్ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. విశిష్ట సేవలందించిన మహిళా పోలీసు అధికారులు, గ్రామ, వార్డు మహిళా పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేశారు. జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను ఘనంగా సన్మానించారు. స్ఫూర్తిదాయకమైన సేవలందించారని కొనియాడారు. సన్మానం పొందిన వారిలో ఎఎస్‌పి పూజిత నీలం, గైనకాలజిస్టు డాక్టర్ మమతేశ్వరిజంగా, కౌన్సిలర్ పర్వీన్, మూలే సరస్వతి, మున్వర్ సుల్తానా, ఎం. చంద్రకాంతమ్మ, డాక్టర్ రేఖారావు, లక్ష్మిప్రసన్న, డాక్టర్ హిమబిందు, డాక్టర్ పావని, శ్రీమాధుర్య, డాక్టర్ మేరీ సుజాత పాల్గొన్నారు. **స్ఫూర్తి షార్ట్‌ఫిలిం ఆవిష్కరణ..** యువ దర్శకుడు బాల ఆధ్వర్యంలో 'స్ఫూర్తి' పేరుతో మహిళల భద్రతకు పోలీస్ శాఖ కృషి చేస్తున్న తీరును కళ్లకు కట్టినట్లు రూపొందించిన షార్ట్ ఫిలింను ఎస్‌పి ఆవిష్కరించారు. షార్ట్ ఫిలిం సందేశాత్మకంగా ఉందన్నారు. షార్ట్ ఫిలిం టీమ్‌ను అభినందించారు. **మహిళలను గౌరవించినప్పుడే సమాజాభివృద్ధి : జడ్జి** మహిళలను గౌరవించినప్పుడే దేశం, సమాజం అభివృద్ధి చెందుతుందని సీనియర్ సివిల్ జడ్జి, ఎస్. కవిత పేర్కొన్నారు. ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డిఎస్ఆర్ మనోహర్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. **యుటిఎఫ్ ఆధ్వర్యంలో..** సామాజిక సేవలో మహిళా మణులే కీలకపాత్ర పోషించారని పెండ్లిమర్రి మండలం ఇసుకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ తెలిపారు. బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సుజాత రాణి అధ్యక్షతన అయ్యవారు రెడ్డి మెమోరియల్ నర్సింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లూసి పెట్రీషియాను యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లూసి పెట్రిషియా, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, నర్సింగ్ కళాశాల ఉపాధ్యాయులు సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు. **ఎల్ఐసి ఆధ్వర్యంలో..** స్థానిక ఎల్ఐసి డివిజన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్ర ఆచార్యులు డాక్టర్ పి.వి.కృష్ణారెడ్డి హాజరయ్యారు. అనంతరం కార్యాలయ సిబ్బంది చౌడేశ్వరి వృద్ధాశ్రమానికి పది కుర్చీలు, వివేకానంద ఆశ్రమానికి మిక్సీ, కాశినాయన వృద్ధాశ్రమానికి ఆరు ఫ్యాన్లు వితరణ చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఇడిఎంఎస్ విభాగం మేనేజర్ శ్రీదేవి, అమీనా పర్వీన్, శ్రీవాణి, వసుప్రద, వారిజాతమ్మ, శ్రీకృష్ణ, లీలాలక్ష్మి యూనియన్ నేతలు అవధానం శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డి, అక్బర్ బాషా, రాజు, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. **జనవికాస్ ఆధ్వర్యంలో..** నగరంలోని రహ్మతీయ కన్వెన్షన్ హాల్‌లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళా ప్రజా సంఘాల ప్రతినిధులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్‌బిసిసి జిల్లా కో-ఆర్డినేటర్ కేతు, డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం, టిడిపి నాయకులు అమీర్‌బాబు హాజరయ్యారు. అనంతరం సఖి ఫౌండేషన్ ప్రతినిధి రహమతునిసా, జెఎస్ఒ ప్రతినిధి సువర్ణ, బృందా వృద్ధాశ్రం ప్రతినిధి సుధారాణి, అనుషాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జన వికాస్ కన్వీనర్లు పి.మన్సూర్ అలీఖాన్, సి.ఎస్ నాసర్ అలీ, ఆల్ ఇండియా బ్యాక్ వార్డ్ క్లాస్సెస్ జిల్లా అధ్యక్షులు పి.వి.రమణ, ఎస్ఎం ల్యాబ్ అధినేత, జన వికాస్ కోశాధికారి మస్తాన్ వల్లి,జన వికాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసులు, ఐయుఎమ్ఎల్ పార్టీ జిల్లా అధ్యక్షులు అలిషేర్, జన వికాస్ డైరెక్టర్ తారిక్, మైనారిటీ నేత అబ్దుల్ వాజీద్, ఫజల్ పాల్గొన్నారు. **జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో ఏడి పి.వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో..** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శిక్షణాధికారి గుర్రప్ప, సమాచార పర్యవేక్షక ఇంజినీరు శ్రీనివాసరావు, ఎపిఆర్ఒ సునీల్ సాగర్, ఎవిఎస్ నాగయ్య టైపిస్టులు శ్రీవాణి, కేశవర్ధిని, . విజయ కుమారి, జయమ్మ, సుప్రజా, నాగజ్యోతి కార్యాలయ సిబ్బంది పాల్గొ న్నారు. **వైసిపి కార్యాలయంలో** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైసిపి నగర అధ్యక్షులు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ ఆధ్వర్యంలో బుధవారం కడపలోని వైసిపి జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, మేయర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో పార్టీకి ఉత్తమ సేవలు అందించిన మహిళ నాయకులను ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉషారాణి, కడప నగర అధ్యక్షు రాలు టిపి వెంకట సుబ్బమ్మ, మహిళా నాయకురాలు, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, పత్తి రాజేశ్వరి, మరియ (కో - ఆప్షన్‌లు), రత్నకుమారి, కృష్ణ వేణి, ఉమా మహేశ్వరి, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** స్థానిక కస్తూరీ బా గాంధీ బాలికల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్, మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శారీరక ఎదుగుదల, రుతుక్రమం, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులకు రుతుక్రమంపై కామిక్స్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఒఎల్ఎఫ్ హెచ్ఎం ఆరోగ్యరాణి, వైద్యులు డాక్టర్ మౌనికరెడ్డి, ఎంటిఎఫ్ నిర్వాహకులు ప్రజ్వలరెడ్డి, ఎఫ్‌సిఐఎన్ సంస్థ నిర్వాహకులు చిత్తా థామస్ రెడ్డి, డాక్టర్ గీత పాల్గొన్నారు. **బాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో** మహిళా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల మహిళా ఆర్గనైజర్ మాణిక్యమ్మ, మండలంలోని మెన్, ఉమేన్ ఆర్గనైజర్లు, ఎం. విజయ్ కుమార్, కిన్నెర శేఖర్ బాబు, ఓబులేసు పాల్గొన్నారు. **వేంపల్లె :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు ఖాజా పర్వీన్, యశోద, షికీలా, నాగరత్నమ్మను తులసిరెడ్డి, ఆయన సతీమణి అలివేలమ్మ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, చెన్నకేశవ, అమర్, ఉత్తన్న, శివ, వెంకటేష్, బద్రీ, రాఘవయ్య పాల్గొన్నారు. ఆధునిక ప్రపంచంలో సమాజం సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి మహిళల పాత్ర ప్రధాన కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం వేర్వేరుగా వారు మహిళలను సత్కరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పోలీసుస్టేషన్‌లో, భవిత కేంద్రంలో పని చేస్తున్న మహిళాలను సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సాధికారికత కన్వీనర్ డాక్టర్ నాగలక్ష్మిదేవి మాట్లాడారు. భవిత కేంద్రంలో పని చేసే సిజివి సుజాతకు సంఘ మిత్ర సిరాజుద్దీన్ రూ.5వేలు విరాళంగా అందజేయడం సంతోషకరమని ఐఇఆర్‌టి యశోద తెలిపారు. భవిత కేంద్రానికి ఫిజియోథెరపీ మెటీరియల్ కొనుగోలుకు బెంగళూరుకు చెందిన భాగ్యలక్ష్మి, విజయ్ దంపతులు రూ.10వేలు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కంప్యూటర్ అధ్యాపకురాలు కిరణ్మయి, ఆస్మ సిద్దిఖ్, కళ్యాణి, లైబ్రేరియన్ మాధవరావు, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజా పర్వీన్, సిఆర్‌పి సూర్యకుమారి, నజియా, ఎస్ఐలు రఘురాం, తిరుపాల్ నాయక్, ఎఎస్ఐలు అన్వర్, మూర్తి పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** సమాజంలో స్త్రీ, పురుషులు సమానమి గుర్తించిన నాడే మహిళలు అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతారని జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిఎస్‌పి నాగరాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ అగస్టిన్‌రాజు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కెఎస్ లత, న్యాయవాదుల సంఘం నాయకులు మురళీధర్‌రెడ్డి, అర్బన్ సిఐ సదాశివయ్య, రూరల్ సిఐ కొండారెడ్డి, న్యాయవాదులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** పట్టణంలో మహిళాదినోత్సవం సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ ఆడిటోరియం ఆవరణలో పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణ సిఐ రాజు ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రాంతీయ ఆసుపత్రిలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రైట్స్ స్వచ్ఛంద సేవ డైరెక్టర్ త్యాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



జమ్మలమడుగు : మాట్లాడుతున్న జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్


మహిళలను సన్మానిస్తున్న డిప్యూటీ సిఎం అంజద్‌బాషా, నాయకులు


వేంపల్లె : మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న తులసిరెడ్డి, నాయకులు